క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

వెల్దండ: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ విజయ అధ్యక్షతన ప్రత్యేక మండల సర్వసభ్య సమావేశం నిర్వహించను న్నట్లు బుధవారం ఎంపీడీఓ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలియజేశారు.

24న ప్రవేశ పరీక్ష

వెల్దండ: మండల కేంద్రంలోని మోడల్ హైస్కూల్ ఆరో తరగతి ప్రవేశానికి ఈ నెల 24న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పుష్పలత బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆరో తరగతిలో మిగిలిన సీట్ల కోసం ఆసక్తి ఉన్నవారు ఈ నెల 23న పాఠశాలల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 24న ఉదయం 11 గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రైతుబంధుకు దరఖాస్తులు

చారకొండ: మండలంలోని నూతన పట్టా పాసుపుస్తకాలు జూన్ 16 వరకు వచ్చిన రైతులు ఆయా గ్రామాల్లో ఏఈఓలకు సంబంధిత పత్రాలను జత చేసి దరఖాస్తులు సమర్పించి రైతుబంధుకు నమోదు చేసుకోవాలని బుధవారం చారకొండ మండల వ్యవసాయ అధికారి చిన్న హుస్సేన్ తెలియజేశారు. గ్రామాల్లో ఏఈఓలు దరఖాస్తు స్వీకరణ చేపట్టారు. 26 నుంచి వానాకాలం రైతుబంధు రైతు ఖాతాలో జమకానుండటంతో రైతులు త్వరగా నమోదు చేసుకోవాలని సూచించారు.

ఓటర్‌గా పేరు నమోదు చేయించుకోండి

లింగాల: కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభమైందని, మండలంలో అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మునీరొద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 01-10-2023 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు, కొత్తగా పెళ్లయిన వారు ఓటరుగా తమ పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు. ఇందుకు పదో తరగతి మెమో, ఆధార్, ఫొటోతో తమకు దగ్గరలో ఉండే బీఎల్ఓ లేదా వీఆర్ఏ, అంగన్‌వాడీ టీచర్లను సంప్రదించాలని తెలియజేశారు.

విత్తనాలు నాటొద్దు

బిజినేపల్లి: వానాకాలం పంట సాగు కోసం రైతులు ప్రస్తుత పరిస్థితుల్లో తొందర పడి విత్తనాలు విత్తుకోవద్దని మండల వ్యవసాయాధికారి నీతి ఒక ప్రకటనలో తెలియజేశారు. బుధవారం కురిసిన వర్షంతో భూమి ఇంకా చలువ పడలేదన్నారు. మొక్కజొన్న, పెసర, మినుము జూలై 15వ తేదీ వరకు విత్తుకోవచ్చని సూచించారు.

భక్తిశ్రద్ధలతో గంధోత్సవం



కొల్లాపూర్: పట్టణ సమీపంలోని సోఫీ చమన్ దర్గా గంధోత్సవ వేడుకలను బుధవారం రాత్రి ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జామె మసీద్ ఆఫీసాహెబ్ ఆరీఫ్‌షత్తారీ ఇంటి నుంచి గంధోత్సవం బయలుదేరింది. ముస్లింలు పెద్ద సంఖ్యలో ఊరేగింపులో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి హైదరాబాద్, మహబూబ్‌నగర్ ప్రాంతాలకు చెందిన కళాకారులు ఖవ్వాలీ ప్రదర్శనలు ఇచ్చారు. షత్తారీ, అహ్మద్‌ఘోరీ, ఫయాజ్, ఖాదర్‌పాష తదితరులున్నారు.

డిజిటల్ బోర్డు ప్రారంభం

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డులను ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు ప్రారంభించారు. 'బోర్డుపై వెల్‌కం టూ మిస్టర్ చిద్విలాస్‌రెడ్డి' అని గువ్వల బాలరాజు రాశారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ -2023 ఫలితాల్లో అఖిల భారత స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన వావిలాల చిద్విలాస్‌రెడ్డి గురువారం స్వగ్రామమైన బల్మూర్ మండలం గోదల్‌కి రానున్నారు. చిద్విలాస్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు చదవాలని సూచించారు.

ఆరోగ్య ఉపకేంద్రం తనిఖీ

ఉప్పునుంతల: మండలంలోని కాంసానిపల్లి ఆరోగ్య ఉప కేంద్రాన్ని బుధవారం డిప్యూటీ డీఎంహెచ్ఓ తారాసింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉప కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. అక్కడ ఉన్న గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత ఉన్న గర్భిణులకు ఐరన్ ఇంజక్షన్లు ఇవ్వాలని వైద్య సిబ్బందికి సూచించారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులను గుర్తించి ఉప కేంద్రంలోనే వారికి మందులు ఇవ్వాలని చెప్పారు. వ్యాధి నిరోధక టీకాలు వేసుకునే వారి వివరాలను ఆయన పరిశీలించారు. ఎంఎల్‌హెచ్‌పీ రజిని, హెల్త్ అసిస్టెంట్ రమేష్, ఏఎన్ఎం మంజుల పాల్గొన్నారు.

కేజీ టు పీజీ విద్య జాడేది?

నాగర్‌కర్నూల్ రూరల్: విద్యావ్యవస్థ పూర్తిగా భ్రష్టుపట్టి పోయిందని, బహుజన ముక్తి పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ గడ్డం విజయ్ ఆరోపించారు. బుధవారం జెడ్పీ గ్రౌండ్‌లో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. తెలంగాణలో ఏం సాధించారని దశాబ్ది ఉత్సవాలను జరుపుకొంటున్నారని, కేజీ టూ పీజీ విద్యా విధానాన్ని అమలు చేసినందుకా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో విద్యకు 6.5 శాతం ఉండే నిధులు ఏ మాత్రం సరిపోతాయన్నారు. తక్షణం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాము, కృష్ణ, రాము, క్రాంతి, కిరణ్, సిద్ధూ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రపంచ యోగా దినోత్సవాన్ని బుధవారం మండలంలోని అన్ని గ్రామాలతో పాటు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగాతో కలిగే ప్రయోజనాలను వివరించారు.

• యోగా మానవుల్లో సంపూర్ణ ఆరోగ్యానికి దోహద పడుతుందని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తిలోని హైదరాబాద్ చౌరస్తా నుంచి జేపీనగర్‌లోని గురుకుల పాఠశాల వరకు ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 2కే రన్‌లో ఆయన పాల్గొన్నారు. అనంతరం గురుకుల పాఠశాలలోని మైదానంలో ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా వేడుకలు నిర్వహించారు.

• కొల్లాపూర్ పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో యోగా దినోత్సవం నిర్వహించారు. పతంజలి యోగా సమితి జిల్లా అధ్యక్షుడు అర్జున్‌గౌడ్ సమక్షంలో మెజిస్ట్రేట్ ఆర్‌వీఎస్ఎస్ మిథున్‌తేజ, జ్యోత్స్న గుంటితో పాటు న్యాయవాదులు యోగాసనాలు వేశారు.

జీవాత్మ, ఆత్మల అనుసంధానమే యోగా

ఆధ్యాత్మికత ద్వారానే అంతరంగ ప్రశాంతత సాధ్యమవుతుందని, జీవాత్మ, ఆత్మల అనుసంధానమే యోగ అని రఘు గురూజీ అన్నారు. అచ్చంపేట పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూమెంట్, సత్యసాయి ధ్యాన మండలి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

– 'సాక్షి' నెట్‌వర్క్



తాడూరు మండలం గోవిందాయిపల్లిలో యోగాలో పాల్గొన్న విద్యార్థులు



అచ్చంపేట సివిల్ కోర్టు ఆవరణలో...



కల్వకుర్తిలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి



ఈగలపెంటలో ..



గౌరారం అంగన్‌వాడీ కేంద్రం వద్ద యోగాసనాలు



ఊర్కొండలో..



లింగాల మండల పరిధిలోని అవుసలికుంటలో



నాగర్‌కర్నూల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో..

విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచాలి



ఆశ్రమ పాఠశాలలో మాట్లాడుతున్న డీటీడీఓ

లింగాల: విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచి నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలని డీటీడీఓ కమలాకర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను, మండల పరిధిలోని అప్పాయపల్లి బాలుర ఆశ్రమ పాఠశాలను డీటీడీఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఆశ్రమ పాఠశాలల్లోని సౌకర్యాలను పరిశీలించారు. బాలికల ఆశ్రమ పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణాలు నత్తనడకన కొనసాగడంపై అసహనం వ్యక్తం చేశారు. పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని హెచ్‌ఎంను ఆదేశించారు. అప్పాయపల్లి ఆశ్రమ పాఠశాలలో తరగతి గదులు, ఇతర సౌకర్యాల కొరతను గమనించిన డీటీడీఓ సౌకర్యాల కల్పనకు కృషిచేస్తానన్నారు. విధులకు సక్రమంగా హాజరు కావాలని ఉపాధ్యాయులకు సూచించారు. డీటీడీఓ వెంట ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తిర్పతయ్య, మాసమ్మ ఉన్నారు.

పాఠశాలలో బాలకార్మికుల చేరిక

బల్మూర్: కోనేరు సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చైల్డ్‌లైఫ్ బృందం బుధవారం మండలంలోని చెంచుగూడెం బాలికల ఆశ్రమ పాఠశాలలో ముగ్గురు బాలకార్మికులను చేర్పించారు. అచ్చంపేటకు చెందిన రాజేశ్వరి, పల్లవి, శివాణి రెండేళ్ల కిందట చదువు మానేసి బాలకార్మికులుగా పనిచేస్తున్నారు. వారిని గుర్తించి పిల్లలను బడికి పంపించకుండా పని చేయించడం నేరమని తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పాఠశాలలో చేర్పించినట్లు కోనేరు సంస్థ ప్రతినిధులు రాణి తెలియజేశారు.

పాఠశాలల పరిశీలన

తాడూరు: మండలంలోని ఐతోల్ ప్రాథమిక పాఠశాలను బుధవారం మండల నోడల్ అధికారి తిరుపతయ్య ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని పలు రికార్డులు కొత్తగా పాఠశాలలో చేరిన విద్యార్థుల నమోదు, ఎఫ్ఎల్ఎన్ శిక్షణకు సంబంధించిన వివరాలను పరిశీలించారు.

జయశంకర్‌కు ఘన నివాళి



నాగర్‌కర్నూల్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు

కల్వకుర్తి టౌన్: తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి పట్టణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్ రెడ్డి జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి, ఆయన స్మృతులను గుర్తుచేసుకున్నారు.

నాగర్‌కర్నూల్ రూరల్: బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల పాఠశాలతో పాటు కార్యాలయాల్లో ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. శ్రీనివాస్‌రెడ్డి, ఆనంద్, శేషగిరి, గంగమోహన్ పాల్గొన్నారు.

తాగునీరు అందిస్తాం..



వెల్దండ: మారూమూల తండాల్లో నివాసం ఉంటున్న గిరిజనులకు స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి ఐక్యత ఫౌండేషన్ కృషి చేస్తుందని చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని అల్లంతోట బావితండాలో దాదాపుగా రూ.2 లక్షలతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నీటిశుద్ధి జలకేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డి మాట్లాడారు. స్వచ్ఛంద సంస్థల వారు అందిస్తున్న సేవలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ కుమార్, ఎంపీటీసీ టిట్టికా దురామ్‌నాయక్, రాజు, రమేష్ పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్‌కు సన్మానం

కల్వకుర్తి: దశాబ్ది ఉత్సవాల్లో తెలంగాణ హరిత దినోత్సవం సందర్భంగా కల్వకుర్తి మున్సిపాలిటీకి రాష్ట్ర స్థాయిలో అవార్డు లభించింది. బుధవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో భారత రాష్ట్ర సమితి బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు దుర్గయ్య సాగర్, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, కమిషనర్ అశ్రిత్ కుమార్‌లను శాలువాతో సత్కరించారు.

హరితహారానికి సిద్ధం కావాలి

చారకొండ: త్వరలో చేపట్టే హరితహారం కార్యక్రమానికి నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేయాలని ఎంపీడీఓ జయసుధ సూచించారు. మండలంలోని కమాల్‌పూర్ తండాల్లో బుధవారం ఎంపీడీఓ జయసుధ నర్సరీని తనిఖీ చేసి మొక్కలను పరిశీలించారు. వారివెంట ఎంపీఓ వెంకటేష్ ఉన్నారు.

దాతల సహకారాన్ని వినియోగించుకోవాలి

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల పేద విద్యార్థులకు దాతలు అందించే సహాయ, సహకారాలను వినియోగించుకోవాలని సర్పంచ్ ప్రమీలమ్మ, ఎంపీటీసీ సుజాత తెలియజేశారు. బుధవారం మండలంలోని మేడిపూర్ ఉన్నత పాఠశాలలో 200 మంది విద్యార్థులకు డాక్టర్ రావూస్ ఈఎన్‌టీ ఆస్పత్రి ఆధ్వర్యంలో బూట్లు, సాక్స్‌లు, సామగ్రిని విద్యార్థులకు అందించారు.

పాలెం డిగ్రీ ప్రిన్సిపాల్‌కు అభినందనల వెల్లువ

బిజినేపల్లి: దశాబ్ది ఉత్సవాల సందర్భంగా పాలెం శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విద్యారాణికి జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రిన్సిపాల్ పురస్కారం అందుకున్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పాలెం డిగ్రీ కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

చెక్కు అందజేత

అమ్రాబాద్: పదర మండలంలోని ఇప్పలపల్లికి చెందిన రెడ్యానాయక్ గతంలో అనారోగ్యానికి గురికాగా వైద్యఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి రూ.43 వేలు మంజూరయ్యాయి. ఆ చెక్కును బుధవారం హైదరాబాద్‌లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు పి రాములు చేతుల మీదుగా అందజేశారు.

నిధులు మంజూరు

అచ్చంపేట రూరల్: మహాత్మా జ్యోతిబాపూలే ట్రైబల్ బీసీ బాలికల వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, కళాశాల భవన నిర్మాణానికి మంజూరైన రూ.5 కోట్ల సిఫారసు లెటర్‌ను బుధవారం ప్రిన్సిపాల్ యామినికి ఎమ్మెల్యే గువ్వల అందజేశారు.

వ్యక్తి అదృశ్యం

కొల్లాపూర్: పట్టణానికి చెందిన బుడగ జంగాల కులస్తుడు కప్పెర శంకర్(29) ఈ నెల 12 నుంచి కనిపించకుండా పోయాడు. అతని కుటుంబికులు పలు ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో వారు బుధవారం కొల్లాపూర్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. శంకర్ అదృశ్యంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ.బాలవెంకటరమణ వెల్లడించారు.

వివాహిత..

వెల్దండ: మండలంలోని ఉబ్బలగట్టుతండా గ్రామ పంచాయతీ పరిధిలోని రావిచెట్టుబావితండాకు చెందిన రాత్లవత్ అఖిల అదృశ్యం కావడంతో భర్త రవికుమార్ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. రాత్లవత్ రవికుమార్, అఖిల మంళవారం రాత్రి భోజనం చేసి నిద్రించారు. రాత్రి 11.30 గంటల సమయంలో రవికుమార్ నిద్రలేచి చూసే సరికి అఖిల కనిపించలేదు. దీంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బంధువుల ఇళ్లలో వెతికినా ఫలితం లేకపోవడంతో భర్త రవికుమార్ వెల్దండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలియజేశారు.

నాగర్‌కర్నూల్‌లో వ్యక్తి..

నాగర్‌కర్నూల్ క్రైం: వ్యక్తి అదృశ్యమైన సంఘటన జిల్లా కేంద్రంలో ఈ నెల 18న చోటుచేసుకోగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలో మంగళి దుకాణం నిర్వహిస్తున్న లక్ష్మణ్ ఈ నెల 18న ఇంటి నుంచి తన దుకాణానికి వెళ్లి ఇంటికి రాలేదు. దీంతో లక్ష్మణ్ భార్య మంగమ్మ దుకాణంలో పనిచేస్తున్న వ్యక్తికి ఫోన్ చేయడంతో కొందరు వ్యక్తులు వచ్చి తీసుకువెళ్లారని చెప్పారు. దీంతో ఆమె భర్త కనిపించకుండా పోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలు మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలియజేశారు.

అటవీ భూమి ఆక్రమణపై కేసు నమోదు

అమ్రాబాద్: అటవీ భూమిని ఆక్రమించిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు అమ్రాబాద్ ఫారెస్టు రేంజర్ ప్రభాకర్ తెలిపారు. ఈ సంఘటనపై ఎఫ్ఆర్ఓ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పదర మండలం చిట్లంకుంటకి చెందిన దాసు ఎకరం అటవీ భూమిని ఆక్రమించడంతో పాటు అదే భూమిలో బుధవారం సాయంత్రం బోరు వేసేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. అటవీ భూమి ఆక్రమణపై కేసు నమోదు చేయడంతో పాటు బోరు వాహనం స్వాధీనం చేసుకోవాల్సిందిగా పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు.

ఎస్పీకి ఫిర్యాదు

నాగర్‌కర్నూల్ క్రైం: పొలం బాట విషయంలో తన భార్యను దుర్భాషలాడిన కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్పీ మనోహర్‌కు వెలుగొండకు చెందిన గోవర్ధన్‌రెడ్డి బుధవారం ఫిర్యాదు చేశారు.

ఇద్దరికి గాయాలు

కల్వకుర్తి టౌన్: మహబూబ్‌నగర్ జిల్లా బోయపల్లికి చెందిన గంగపురి అతని కుటుంబ సభ్యులతో కలిసి ఆంధ్రప్రదేశ్ గురజాలలోని పుణ్యక్షేత్రాన్ని చూడటంతో పాటుగా అక్కడే ఉన్న వారి గొర్రెల మంద వద్ద వారి బంధువులను పలకరించేందుకు ఇంటి నుంచి బొలెరో వాహనంలో బయలుదేరాడు. ఊర్కొండ మండలంలోని సూర్యలత స్పిన్నింగ్ మిల్లు నుంచి కాటన్ లోడ్‌తో డీసీఎం వాహనం కల్వకుర్తిలోని కాటన్‌మిల్లుకు వస్తుంది. కల్వకుర్తి మండలంలోని మార్చాల నుంచి బొలెరో, డీసీఎం వాహనాలు ఒకదాని వెంట ఒకటి వస్తున్నాయి. ఇదే క్రమంలో కల్వకుర్తి మండలంలోని మార్చాల పరిధిలోని కాటన్‌మిల్లుకు డీసీఎం వాహనం చేరుకోగానే.. ఒక్కసారిగా డీసీఎం మిల్లులోకి మళ్లించాడు. దీంతో వాహనం వెనుకనే ఉన్న బొలెరో వాహనం డీసీఎంను ఢీకొట్టింది. దీంతో బొలెరోలోని యువకుడితో పాటుగా, వరలక్ష్మి అనే గర్భిణికి గాయాలయ్యాయి. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పుణ్యక్షేత్రాల అభివృద్ధికి పెద్దపీట



సహకార భవనాన్ని ప్రారంభిస్తున్న బీరం



ఉమామహేశ్వరంలో పూజలు చేస్తున్న బాలరాజు

అచ్చంపేట రూరల్: పుణ్య క్షేత్రాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. బుధవారం శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆధ్యాత్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రభుత్వ విప్ బాలరాజుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. తెలంగాణ ఆధ్యాత్మిక చాటేలా పుణ్య క్షేత్రాలను అభివృద్ధి చేశామన్నారు. ప్రభుత్వం దూప, దీప, నైవేద్యంతో ప్రతి ఆలయానికి నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఆర్డీఓ పాండునాయక్, తహసీల్దార్ కృష్ణయ్య, సర్పంచ్ లోక్యానాయక్, కందూరి సుధాకర్, శ్రీనివాసరావు, విష్ణుమూర్తి, మనోహర్, రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

మామిళ్లపల్లి ఆలయంలో పూజలు

ఉప్పునుంతల: మండలంలోని మామిళ్లపల్లి శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక పూజలు చేశారు.

నూతన ప్రభుత్వ భవనాలు ప్రారంభం

కొల్లాపూర్ రూరల్/ ఊర్కొండ/ తెలకపల్లి: మండల పరిధిలోని సింగోటంలో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ప్రభుత్వ నిధుల నుంచి నూతనంగా నిర్మించిన ప్రాథమిక సహకార సంఘం భవనం, నూతన యాదవ కమ్యూనిటీ భవనాన్ని, గ్రాంథాలయ భవనాన్ని ప్రారంభించారు. అదే విధంగా గ్రామ సమీపంలోని శ్రీలక్ష్మి నరసింహ స్వామి దేవాలయ ఆవరణలో తెలంగాణ ఆధ్యాత్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని సుదర్శన హోమం, రుద్ర హోమం నిర్వహించారు.

అమ్రాబాద్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం పదర మండలం మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి ఆలయం వద్ద ధార్మిక దినోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లోక కల్యానార్థం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి తీర్థ ప్రసాద వితరణలు చేశారు. ఆలయ అధికారులు జైపాల్‌రెడ్డి, నాగరాజు, జంగయ్య, ప్రధాన అర్చకులు వీరయ్యశర్మ తదితరులు ఉన్నారు.



ఊర్కొండలో అర్చన చేయిస్తున్న నాయకులు

ఆర్టీసీలో టీ-9 టికెట్లను వినియోగించుకోండి

కొల్లాపూర్: ఆర్టీసీ సంస్థ నూతనంగా అమలులోకి తీసుకొచ్చిన టీ-9 టికెట్లను మహిళలు, వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని కొల్లాపూర్ డిపో మేనేజర్ రాజేశ్వర్ సూచించారు. టీ-9 టికెట్లను ఈ నెల 18 నుంచి అమల్లోకి తీసుకొచ్చారన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 60 కి.మీటర్ల పరిధిలో మహిళలు, వృద్ధులు ప్రయాణాలు కొనసాగించేందుకు రూ.100 చెల్లించవచ్చన్నారు. ఈ టికెట్‌తో నిర్ణీత సమయంలో 60 కిలోమీటర్ల పరిధిలో ఉచిత ప్రయాణాలు చేయవచ్చన్నారు. మహిళలు, వృద్ధులు తమ ఆధార్‌కార్డును చూపించి టీ-9 టికెట్ పొందవచ్చన్నారు. కొల్లాపూర్ డిపోలో అత్యధికంగా టీ-9 టికెట్లు అమ్మిన కండక్టర్లు అశోక్, సాయిగీతలకు ఆర్టీసీ డీఎం సజ్జనార్ నుంచి ప్రశంసలు అందాయని తెలియజేశారు.

నేడు డయల్ యువర్ డీఎం

గురువారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు డయల్‌యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం.రాజేశ్వర్ తెలిపారు. కొల్లాపూర్ ఆర్టీసీ డిపో పరిధిలోని సమస్యలు, సలహాలను తెలియజేసేందుకు ప్రయాణికులు సెల్‌నం. 9000405878 కు ఫోన్ చేయాలని సూచించారు.

వాహనదారులు లైసెన్స్ కలిగి ఉండాలి



వాహనాలు తనిఖీ చేస్తున్న డీటీఓ ఎరిస్వామి

పెద్దకొత్తపల్లి: వాహనాలు నడిపే వారు లైసెన్స్ తప్పనిసరి కలిగి ఉండాలని డీటీఓ ఎరిస్వామి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం 26 వాహనాలను తనిఖీ చేశారు. వాటిలో 4 వాహనాలను సీజ్ చేశారు. 2 ఆటోలు, కమాండర్ జీపు, టిప్పర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాహనదారులు లైసెన్స్, ఇన్సూరెన్స్ పత్రాలను తప్పనిసరిగా పొందాలని, లైసెన్స్‌లు లేని వారు వాహనాలు నడిపి ప్రమాదాలను కొనితెచ్చుకోవద్దని సూచించారు. ప్రైవేట్ వాహనాల్లో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని ప్రమాదాలు కలిగించవద్దన్నారు. రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పెంచాలి


కొల్లాపూర్: బీసీ కులవృత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం ఇచ్చిన దరఖాస్తు గడువును పొడిగించాలని బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కట్టా శ్రీనివాసులు కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తహసీల్దార్ కార్యాలయాల్లో సాంకేతిక సమస్యల కారణంగా చాలా మంది సకాలంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పొందలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

పదేళ్ల పాలనపై నిరసన



నాగర్‌కర్నూల్‌రూరల్: బీఎస్పీ ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 21 రోజుల సంబరాల పేరుతో ప్రజలను మభ్యపెట్టడాన్ని నిరసిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకుడు కొత్తపల్లి కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలో వేదికను ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. బ్రహ్మయ్య, రాంచందర్, శ్రీను, శేఖరయ్య, ఆంజనేయులు, కృష్ణయ్య, నర్సింహ, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పండ్ల మొక్కలు పంపిణీ



పెద్దకొత్తపల్లి: యాపట్ల ప్రభుత్వ పాఠశాలలో అక్షరా డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు పండ్ల మొక్కలు బుధవారం పంపిణీ చేశారు. ట్రస్టు చైర్మన్ శివ మాట్లాడుతూ.. దానిమ్మ, జామ, కొబ్బరి మొక్కలను విద్యార్థులకు అందజేస్తున్నాము, వాటిని ఇళ్ల పరిసరాల్లో నాటుకుని సంరక్షించుకుని పండ్లను పొందాలని సూచించారు. లవకుమార్, శ్రీనివాస్, శ్రీశైలం, పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు విక్రయిస్తే ఆందోళన


కొల్లాపూర్: ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాల పేరుతో విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తే ఆందోళన చేస్తామని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లను అరికట్టేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని వెల్లడించారు.

అక్రమ కట్టడాల కూల్చివేత



కల్వకుర్తి టౌన్: పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలో అక్రమంగా నిర్మాణం చేపట్టిన ఇంటిని బుధవారం కొంత మేర మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ తన సిబ్బందితో కలిసి కూల్చివేయించారు. ఇంటి నిర్మాణాలను పొంది అందుకు విరుద్ధంగా ఎవరైనా నిర్మాణాలు చేపట్టినా వాటిని కూల్చేస్తామన్నారు. మున్సిపాలిటీలో చాలా వరకు అక్రమంగా నిర్మాణాలు చేసిన వాటిని గుర్తించామని, వాటిపై త్వరలోనే చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపాలిటీలో ఎలాంటి అవకతవకలు జరిగినా, అక్రమ నిర్మాణాలు, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా వారిపై మున్సిపల్ చట్టంతో పాటుగా, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లేబర్ కమిటీ సభ్యులకు వైద్య పరీక్షలు



మన్ననూర్: కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సీఏస్‌సీ హెల్త్ కేర్ వారి ఆధ్వర్యంలో లేబర్ కమిటీలో సభ్యులుగా గుర్తించిన వారికి మన్ననూర్‌లోని రైతువేదిక కేంద్రంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరం నిర్వాహకురాలు డాక్టర్ తేజస్విని మాట్లాడారు. శిబిరంలో సీబీపీ, ఎల్ఎఫ్‌టీ, ఆడియో స్క్రీనింగ్, విజన్ స్క్రీనింగ్, హిమోగ్లోబిన్ లేవల్స్, యూరిన్, బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది దివ్య, వెంకటేష్, మహదేవన్, అఖిల తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో బుధవారం డివిజన్ స్థాయి పంచాయతీ రాజ్ ఉద్యోగుల క్రికెట్ టోర్నీని డివిజన్ పంచాయతీ అధికారి వెంకటయ్య ప్రారంభించారు. మొదటి బహుమతి అచ్చంపేట ఎంపీడీఓ మధుసూదన్‌గౌడ్ రూ.10,116లు ప్రకటించారు. క్రీడల్లో ఉద్యోగులు రాణించాలని డివిజన్ పంచాయతీ అధికారి వెంకటయ్య కోరారు. ఎంపీడీఓలు మధుసూదన్‌గౌడ్, రాంమోహన్, ఎంపీఓలు వెంకటేశ్వర్లు, నారాయణ, చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.